# సాక్షి
## తూర్పుగోదావరి

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024






### నిండుకుంటున్న నెయ్యి

8లో


అన్నవరం దేవస్థానంలో నెయ్యి టెండర్ వ్యవహారం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దేవస్థానంలో మరో వారం రోజులకు సరిపడ నెయ్యి నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.



### అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వద్ద నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవనానికి రావులపాలేనికి చెందిన మేడపాటి భీమారెడ్డి, భవానీ దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు.

### 2.91 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి సోమవారం సాయంత్రం 2,91,945 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 10,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

## న్యూస్‌రీల్

### డీపీఓ బాధ్యతల స్వీకరణ



జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పంచాయతీ అధికారిగా బి.శ్రీనివాసరావు బొమ్మూరులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ఇన్‌చార్జి డీపీవో ఎం.నాగలత నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖ జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా డీపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 1999లో ముమ్మిడివరం ఎంపీడీవోగా ప్రభుత్వ సర్వీసులో చేరి పెద్దాపురం ఎంపీడీవోగా, విశాఖపట్నం జిల్లాలో జిల్లా పరిషత్ అకౌంట్స్ ఆఫీసర్‌గా, డీప్యూటీ సీఈవోగా, డ్వామా పీడీగా విధులు నిర్వహించినట్టు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంకితభావంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు. ప్రజలకు సేవ చేస్తూ సర్వదా అందుబాటులో ఉంటానని తెలిపారు. డీపీవోను కార్యాలయ పరిపాలనాధికారి జగదీశ్వరి, పలువురు ఈవో పీఆర్‌అండ్‌ఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు అయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ కె.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా ఎంతో కీలకమైన బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించడం జరిగింది.

### పోలీస్ పీజీఆర్‌ఎస్‌కు 27 అర్జీలు

కంబాలచెరువు: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వివిధ రకాల సమస్యలపై ఎస్పీ నరసింహ కిషోర్‌కు 27 అర్జీలు సమర్పించారు. ఫిర్యాదు దారుల సమస్యలను ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.భవ్య కిశోర్, ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ అలీఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

### సత్యదేవునికి తప్పని తుఫాన్ ఎఫెక్ట్

అన్నవరం: భాద్రపదమాసం అంటే శుభకార్యాల మాసం. ఈ నెలలో సత్యదేవుని ఆలయానికి పెద్దగా భక్తులు రారు. శని, ఆదివారాల్లో, దశమి, ఏకాదశి మినహా మిగిలిన రోజుల్లో పెద్దగా భక్తుల సందడి ఉండదు. దానికి తోడు ఈ నెల ప్రారంభంలో తుపాన్, ఆ తరువాత భారీ వర్షం వల్ల భక్తులు బాగా తగ్గిపోవడంతో ఆ ప్రభావం సత్యదేవుని హుండీ ఆదాయం మీద పడింది. ప్రతి నెల రూ.కోటికి పైగా వచ్చే హుండీ ఆదాయం ఈ నెల రూ.78 లక్షలకే పరిమితమైంది. హుండీల ద్వారా గత 28 రోజులకు కేవలం రూ.78,54,428 ఆదాయం సమకూరింది. దేవస్థానం హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం తెరిచి లెక్కించగా నగదు రూ.75,38,066, చిల్లర నాణాలు రూ.3,16,362 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు.


# భవితకు పాతర

- సీబీఎస్‌ఈకి కూటమి ప్రభుత్వం మంగళం
- మూడు నెలలు గడిచాక సిలబస్ మార్పు
- జిల్లాలో 15 సీబీఎస్‌ఈ పాఠశాలల్లో స్టేట్ సిలబస్ బోధన
- 3,162 మంది విద్యార్థులకు అవస్థలు

**సహజంగానే ప్రభుత్వ పాఠశాలల్లో సెలవుదినాలు, పలు ప్రభుత్వ కార్యక్రమాలు, వర్షాలు, వరదలు పోను తరగతులు నిర్వహించే రోజులు చాలా తక్కువ. ఈ పరిస్థితుల్లో సజావుగా సాగుతున్న విద్యా సంవత్సరానికి కూటమి ప్రభుత్వం మోకాలడ్డుతోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సీబీఎస్‌ఈ సిలబస్ కాదని స్టేట్ సిలబస్‌కు మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభించి మూడు నెలలయ్యాయి. ఇప్పటికిప్పుడు సిలబస్ మార్పంటే విద్యార్థులకు సమస్యలు తెచ్చిపెట్టినట్టే. ఈ పరిస్థితిపై పాలకులు పునరాలోచించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.**

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పేద విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోంది. గతంలో కార్పొరేట్ పాఠశాలల్లో అందించే సీబీఎస్‌ఈ సిలబస్‌ను పేద విద్యార్థులందరికీ అందే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకూ తీసుకువచ్చింది. పేదలు, పేద విద్యార్థులంటే కిట్టని చంద్రబాబు ప్రభుత్వం తిరిగి ఆ సిలబస్‌ను రద్దు చేసి కార్పొరేట్ స్కూల్స్‌కు పరోక్షంగా లబ్ధి చేకూరుస్తోంది. ప్రతి విద్యార్థి జీవితంలోనూ కీలకమైన ఘట్టం పదో తరగతి. అందులో సాధించే మార్కులే వారికి భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడతాయి. దీంతో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వాలూ చర్యలు తీసుకుంటాయి. అయితే సీబీఎస్‌ఈ సిలబస్ రద్దు చేస్తున్నామంటూ కూటమి ప్రభుత్వం ప్రకటించి వారి భవితను ప్రశ్నార్థకం చేశారు. విద్యా సంవత్సరం మూడు నెలలు గడిచి పోయింది. పిల్లలంతా సీబీఎస్‌ఈ విద్యను అభ్యసిస్తున్నారు. సడన్‌గా వారిని స్టేట్ సిలబస్‌కు మారాలని చెబుతుంటే అదెలా సాధ్యమని మేధావులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు మనమిచ్చే ఆస్తి ఏదైనా ఉంది అంటే అది చదువు ఒక్కటే అని నమ్మిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. అమ్మఒడితో ప్రతి ఒక్కరూ చదువుకునేందుకు అవకాశం కల్పించారు. నాడు–నేడుతో బడుల రూపురేఖలు మార్చేశారు. ప్రభుత్వ బడుల్లోనూ ఇంగ్లిష్ మీడియం చదువులకు శ్రీకారం చుట్టారు. అలాగే సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) తో పిల్లలను జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకున్నారు. కానీ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన ఐబీ, టోఫెల్‌ను అటకెక్కించిన కూటమి సర్కార్ సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా సామర్థ్యాలు పెంచి వారు ఉన్నత తరగతుల్లో రాణించేందుకు జగన్ సర్కార్ 'టోఫెల్'ను సిలబస్‌లో అంతర్భాగంగా చేసింది. అలాగే ఐబీ(ఇంటర్నేషనల్ బాకలారియెట్)ను ప్రవేశపెట్టింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే టోఫెల్‌కు బైబై చెప్పేసింది.

జిల్లాలోని 15 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ పాఠాలు పదో తరగతి విద్యార్థులకు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే విద్యార్థులు సీబీఎస్‌ఈ సిలబస్‌లోనే యూనిట్ టెస్టులు కూడా రాశారు. ఇటీవల పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని మదింపు చేస్తామంటూ కూటమి ప్రభుత్వం మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇచ్చి ట్యాబ్‌ల ద్వారా పరీక్ష నిర్వహించింది. రాత పరీక్ష కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఆ ఫలితాలు ఏమిటన్నది ఎవరికీ తెలియదు. ప్రభుత్వం మాత్రం సీబీఎస్‌ఈ సిలబస్‌ను విద్యార్థులు అర్థం చేసుకోవడం లేదని దాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో పదో తరగతి విద్యార్థులు కొత్తగా స్టేట్ సిలబస్‌ను ప్రారంభించాలి. ఏ ప్రభుత్వమైనా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే దిశగా చర్యలు తీసుకోవాలి. అంతేగానీ విద్యార్థులకు మేలు వేసే వాటిని రద్దు చేయకూడదు. ఈ నిర్ణయంపై చంద్రబాబు సర్కార్ పునరాలోచించాలి. గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ బడులను అద్భుతంగా తీర్చిదిద్ది తల్లిదండ్రులు, విద్యార్థుల్లో పెంచిన నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకున్నారని విద్యావేత్తలు చెబుతున్నారు. దీనిలో భాగంగా విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టోఫెల్ శిక్షణను అధికారంలోకి వచ్చీరాగానే రద్దు చేసింది. సీబీఎస్‌ఈ చదివిన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఎక్కడికి వెళ్లినా రాణించే అవకాశం ఉంటుంది. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ఎయిమ్స్, జిప్‌మెర్, సీఎంసీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ, నీట్ వంటి పరీక్షలు సీబీఎస్‌ఈ సిలబస్ నేపథ్యంలోనే జరుగుతాయి. వీటికి సిద్ధం కావడం సులభం అవుతుంది. సీబీఎస్‌ఈలో చదవడం వల్ల ఏ రాష్ట్రానికి వెళ్లినా ఇబ్బంది లేకుండా ఉన్నత విద్యను అభ్యసించవచ్చు.




ఇప్పటివరకు సీబీఎస్‌ఈ సిలబస్ నిర్వహించి రద్దు చేసిన డీఎంహెచ్ హైస్కూలు

| జిల్లాలో సీబీఎస్‌ఈ | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| ఏపీఆర్‌ఈఐఎస్ స్కూల్స్ | 1 | 160 |
| ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ | 4 | 609 |
| ఎంపీపీ, జెడ్పీపీ | 6 | 1,430 |
| మున్సిపల్ స్కూల్స్ | 2 | 501 |
| ప్రభుత్వ స్కూల్స్ | 2 | 462 |
| మొత్తం | 15 | 3,162 |

### విద్యార్థుల జీవితాలతో చెలగాటం



కేంద్ర సిలబస్ విద్యార్థులకు మంచి అవగాహన కల్పిస్తుంది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న క్రమంలో ప్రపంచవ్యాప్తంగా సీబీఎస్‌ఈ ఎంతో ఉపయోగపడుతుంది. పాత సిలబస్ తీసెయ్యడం కొత్త సిలబస్ ఫాలో అవ్వాలంటే విద్యార్థులకు చాలా కష్టమైన పని. కొత్త సిలబస్ నేర్చుకోవడం, దానిపై అవగాహ కల్పించుకుని పరీక్షలు రాయడం వల్ల మార్కులు తగ్గితే విద్యార్థుల భవిష్యత్ పాడవుతుంది. ఇలా సిలబస్‌లను మార్చుకుంటూ పోతే ఎంతో నష్టం వస్తుంది. విద్యా విశ్లేషణకులు, విద్యా కమిషన్ ఏంచేస్తున్నాయి. ఇప్పటికే ఎన్‌ఈపీ ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలను విలీనం పేరుతో నాశనం చేస్తున్నారు. తిరిగి కొత్త విధానాలు అమలు చేస్తూ భ్రష్టు పట్టిస్తున్నారు.

– ఎస్.కిరణ్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్వర్ణాంధ్ర 2047 జిల్లా స్థాయి పోటీలను స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు సంబంధించి వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్ పోటీలు జరిగాయి. మండల స్థాయిలో జరిగిన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులు ఈ జిల్లా పోటీలకు హాజరయ్యారు. మొత్తం 19 మండలాల నుంచి 169 మంది విద్యార్థులు వచ్చారు. పోటీల నిర్వహణ అనంతరం డీఈవో వాసుదేవరావు మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్లో అందరూ పాల్గొని రాష్ట్ర అభివృద్ధికి తగు సూచనలు ఇవ్వాలని సూచించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజమండ్రి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈబీవీఎన్ నారాయణ, సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీ శంకరరావు, సీఎంఓకే శ్రీనివాస్, డైట్ లెక్చరర్ ఆర్‌జేడీ రాజు, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

### నిత్య హారతి సమయం మార్పు

సీటీఆర్ఐ: పుష్కరఘాట్ వద్ద గోదావరి నిత్య హారతి సమయంలో మార్పు చేశారు. శీతాకాలం సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటలకు నిర్వహిస్తామని సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాథరాజు రాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. వీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 31వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

# దుర్గతి నాశని నమోస్తుతే

- దశమి ఉత్సవాలకు అమ్మవారి విగ్రహాలు సిద్ధం
- వివిధ పరిమాణాల్లో తయారు చేస్తున్న కళాకారులు

రాజమహేంద్రవరం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఇక దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల సందడి మొదలు కానుంది. ఇందుకోసం జోరుగా విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కళాకారులు వీటి తయారీలో తలమునకలై ఉన్నారు. మోరంపూడిలో రెండడుగుల నుంచి ఎనిమిది అడుగుల ఎత్తు వరకూ దుర్గాదేవి విగ్రహాలను తయారు చేస్తున్నారు. 14 ఏళ్లుగా ఇక్కడ తయారు చేస్తున్నారు. విగ్రహాల తయారీదారుడు రాము కటుంబ సభ్యులు పదిమంది వివిధ రూపాల్లో ఆకట్టుకునేలా అమ్మవారి విగ్రహాలను జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఇక్కడ తయారైన వాటిని రాజమహేంద్రవరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. తక్కువ ధరకే ఆకర్షణీయమైన రూపాల్లో లభిస్తుండటంతో వాటికి మంచి డిమాండ్ ఉంటోంది.

### విగ్రహాల తయారీతో స్వయం ఉపాధి



ఏటా విజయదశమి పర్వదిన సమయానికి దేవీ విగ్రహాలను తయారు చేసి విక్రయించడం ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నాం. కుటుంబ సభ్యులంతా కలిసి తయారీ చేస్తున్నాం. తద్వారా సొంతగ్రామాల్లోనే ఉపాధి పొందుతున్నాం. ఇక్కడ తయారు చేసే విగ్రహాలు ఆకట్టుకునే రూపాలతో ఉండడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

– రాము, విగ్రహాల తయారీదారుడు, మోరంపూడి



విజయవాడ కనక దుర్గమ్మరూపంలో...



సిద్ధంగా ఉన్న కనకదుర్గమ్మ విగ్రహాలు





వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న కనకదుర్గమ్మ విగ్రహాలు

# పీజీఆర్‌ఎస్‌కు 239 అర్జీలు : కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సోమవారం ప్రజల నుంచి 239 అర్జీలను స్వీకరించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పౌర సరఫరాల విభాగానికి సంబంధించి 86, రెవెన్యూ 65, పంచాయతీ రాజ్ 37, పోలీస్ 19, ఇతర శాఖలకు చెందిన 32 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి తగిన పరిష్కారం చూపాలని, చూపకపోతే అందుకుగల కారణాలను అర్జీదారునికి వివరించాలని అధికారులకు సూచించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యకు కారణాలను వివరించే బాధ్యత అధికారులదేనన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

#### ఆర్డీవోగా కృష్ణ నాయక్



రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సోమవారం రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఆర్.కృష్ణనాయక్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను అనుసరించి, కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానన్నారు. జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులతో, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని విధులు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లాలో కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న ఆయన పూర్తి స్థాయిలో రాజమహేంద్రవరం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీఓ నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది కృష్ణనాయక్‌కు అభినందనలు తెలిపారు.

# రత్నగిరికి సౌర కాంతులు

- దసరాకు ప్రారంభించేందుకు సన్నాహాలు
- 75 శాతం పూర్తయిన సోలార్ ప్లాంట్ పనులు

అన్నవరం : రత్నగిరిపై కొలువైన వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఏర్పాటు చేస్తున్న 0.6 మెగావాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. సోలార్ ప్లాంట్ ఉత్పత్తి చేసే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించేందుకు హెచ్‌టీ లైన్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేసి దసరా వేడుకల్లో భాగంగా ఈ ప్లాంట్‌ను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. రూ.3.15 కోట్లతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. శివ సదన్, విష్ణు సదన్, హరిహర సదన్ సత్రాల రూఫ్‌టాప్‌లపై సౌర ఫలకాలను అమర్చే పనులు సోమవారంతో పూర్తయ్యాయి. పెద్ద క్రేన్ ద్వారా ఈ ఫలకలను ఆ సత్రాల రూఫ్‌టాప్‌లకు చేర్చి అమర్చారు. ఈ ప్లాంట్ పనులు పూర్తయ్యేలోపునే తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) అధికారులతో మాట్లాడి ఇక్కడి నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా చూడాలని దేవస్థానం అధికారులను ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. దేవస్థానంలో విద్యుత్ వినియోగం పెరిగిన దృష్ట్యా ఏటా తొమ్మిది లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ 'నెడ్‌క్యాప్' ద్వారా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానంలో 2019లో సుమారు రూ.ఐదు కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ' వన్ మెగావాట్' సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా ఏటా 15 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా ఆ విద్యుత్‌ను పూర్తిగా గ్రిడ్‌కు సరఫరా చేస్తున్నారు. ట్రాన్స్‌కో నుంచి ఏటా దేవస్థానం 25 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా అందులో దేవస్థానం గ్రిడ్‌కు సరఫరా చేస్తున్న 15 లక్షల యూనిట్లు మినహాయిస్తే ఇంకా అదనంగా వాడుతున్న పది లక్షల యూనిట్లకు దేవస్థానం ఏటా రూ.కోటి విద్యుత్ బిల్లు చెల్లిస్తోంది. ఈ రెండో సోలార్ ప్లాంట్ ద్వారా ఏడాదికి ఉత్పత్తి అయ్యే తొమ్మిది లక్షల యూనిట్లను గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. దానికి బదులుగా ట్రాన్స్‌కో నుంచి ఏడాదికి తొమ్మిది లక్షల యూనిట్లు ఉపయోగించుకుని మిగిలిన పదివేల యూనిట్లకు బిల్లు చెల్లిస్తామని అధికారులు తెలిపారు. దీనివల్ల ఏడాదికి 70 నుంచి 80 శాతం వరకు విద్యుత్ బిల్లు తగ్గే అవకాశం ఉంటుంది.



శివ సదన్ సత్రంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు



హరిహర సదన్ సత్రంపైకి సోలార్ ప్యానళ్లను తీసుకువెళ్తున్న క్రేన్

#### పనుల పురోగతిపై ఈఓ సమీక్ష

సోలార్ విద్యుత్ ప్లాంట్ పనుల పురోగతిపై దేవస్థానం ఈఓ కె. రామచంద్రమోహన్ సోమవారం సమీక్షించారు. దసరా వేడుకల నాటికి ఈ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానం విద్యుత్ విభాగం డీఈ వి సత్యనారాయణను ఆయన ఆదేశించారు.

#### దసరా వేడుకలలో అభివృద్ధి పనుల ప్రారంభం

దసరా వేడుకల్లో భాగంగా సోలార్ ప్లాంట్‌తో పాటు జాతీయ రహదారిపై రూ.64 లక్షలతో నిర్మించిన నిర్మాణాలు, దేవస్థానంలో రూ.40 లక్షలతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్, సత్యగిరిపై రూ.36.50 లక్షలతో నిర్మించిన డార్మెటరీ, రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన క్యాంటీన్‌ను దేవదాయశాఖా మంత్రి, ఇతర ప్రముఖులు ప్రారంభించనున్నారు. అలాగే మొదటి ఘాట్‌రోడ్ నుంచి న్యూసీసీ సత్రం వరకు రూ.90 లక్షలతో నిర్మించనున్న మెట్లదారి, నూతన రథానికి కొండ దిగువన రూ.27 లక్షలతో నిర్మించనున్న రథశాలకు కూడా శంకుస్థాపనలు చేయించనున్నారు.

# జాడ లేదే..? ఐనా..!

- రావులపాలెం పరిసరాల్లో కానరాని చిరుత పులి జాడలు
- వదంతులు నమ్మకండి
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డీఎఫ్‌ఓ ఎంవీ ప్రసాదరావు

రావులపాలెం: గత మూడు రోజులుగా చిరుతపులి రావులపాలెంలో పలు ప్రాంతాల్లో కనిపించిందంటూ వస్తున్న సమాచారంపై తనిఖీలు చేయగా, ఎక్కడా చిరుత పులి ఉన్న జాడలు కనిపించలేదని, దీనినిబట్టి ఈ ప్రాంతానికి చిరుతపులి రాలేదని జిల్లా ఫారెస్ట్ అధికారి ఎంవీ ప్రసాదరావు తెలిపారు. సోమవారం రావులపాలెంలోని అమలాపురం రోడ్‌లో ఉన్న టింబర్ మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28న గోదావరిలో కొందరు మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు పులిని చూసినట్టు వచ్చిన సమాచారంపై అన్ని విధాలా తనిఖీలు చేయగా, ఎటువంటి పాదముద్రలు, జాడలు లభించలేదన్నారు. తమ సిబ్బంది ఆరు టీములుగా బోట్లు, డ్రోన్లతో గోదావరి పరిసర ప్రాంతాల్లో గాలింపు చేశారన్నారు. ఎక్కడా పులి ఆనవాళ్లు లభించలేదన్నారు. అలాగే పులిని చూశామన్న మత్స్యకారులతో కలిసి సోమవారం ఉదయం గోదావరి మధ్యలో ఉన్న దిబ్బలపై కూడా నావలపై వెళ్లి పరిశీలన చేశామన్నారు. ఎక్కడా ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ ప్రాంతంలో చిరుతపులి లేదని స్పష్టం చేశారు. అయితే కడియపులంక ప్రాంతం సమీపంగా ఉండటంతో, ఒకవేళ అది వచ్చి ఉంటే.. అన్న కోణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటరిగా తిరగకుండా, గుంపుగా పనులకు వెళ్లి రావాలన్నారు. అలాగే ఎవరైనా చిరుతపులిని చూస్తే తమకు కచ్చితమైన సమాచారం ఇవ్వాలన్నారు. తప్పుడు సమాచారంతో సమయం వృథా అవ్వడం తప్ప ప్రయోజనం లేదన్నారు. ప్రజల భయాందోళనను దృష్టిలో ఉంచుకుని, సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను ప్రచారం చేయవద్దని కోరారు.

#### విస్తృత తనిఖీలు

తనిఖీల్లో భాగంగా రావులపాలెం, ఊబలంక, కొమరాజులంక ఏరియాల్లో గోదావరి ఒడ్డున ఉన్న ప్రాంతాన్ని, ఇటుక బట్టీ ప్రాంతాన్ని, పలు దూళ్ల పాకలు, ఇలా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేశామని డీఎఫ్‌ఓ తెలిపారు. ఎక్కడా పులి సంచరించిన ఆనవాళ్లు లేవన్నారు. కడియపులంకలో కనిపించిన పులి అడుగు ఎనిమిది సెం.మీ. ఉందని, ఏ వైపు చూసినా, ఈ ప్రాంతంలో ఉన్నవి మూడు నుంచి నాలుగు సెం.మీ. మాత్రమే ఉన్నాయని, ఇవి కుక్కల అడుగులని స్పష్టం చేశారు. పులి అడుగులో గోరుముద్రలు ఉండవన్నారు.

#### పారిపోవద్దు

పులి కనిపిస్తే వెనుకకు పారిపోకుండా, నిలబడి గట్టిగా అరుస్తూ పక్కకు తప్పుకోవాలని డీఎఫ్‌ఓ అన్నారు. పరుగెడితే అది మీద పడి దాడి చేస్తుందని తెలిపారు. పులి తనకంటే ఎక్కువ ఎత్తు ఉన్న మనుషులపై కానీ, జీవులపై కానీ దాడి చేయదని, అందుకే పులి కనిపించగానే చేతులు పైకి ఎత్తి దానిని చూస్తూ జాగ్రత్తగా తప్పుకోవాలని సూచించారు. ఒకవేళ నిజంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో రేంజ్ అధికారులు కె.దుర్గారామ్ ప్రసాద్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌ఓ ప్రసాదరావు



రావులపాలెం లంక ప్రాంతాల్లో పరిశీలిస్తున్న అధికారులు



రావులపాలెంలో డ్రోన్లతో గాలిస్తున్న సిబ్బంది

## క్లుప్తంగా

### కాలువలో మృతదేహం లభ్యం



కోలా సత్యనారాయణ(ఫైల్)

కిర్లంపూడి: గోనేడ గ్రామానికి చెందిన కోలా సత్యనారాయణ(61) మృతదేహం సోమవారం ఏలేరు కాలువలో లభ్యమైనట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. బహిర్భూమికి వెళ్లిన సత్యనారాయణ అదుపుతప్పి కాలువలో పడి గల్లంతైనట్టు ఆదివారం కేసు నమోదైంది. సోమవారం ఉదయం ఏలేరు కాలువలో గాలింపు చేపట్టగా, పెద్దాపురం మండలం కాండ్రకోట లాకుల వద్ద మృతదేహం లభ్యమైంది. ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అతడి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, వారికి పెళ్లిళ్లయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్

జగ్గంపేట: రాష్ట్ర స్థాయి స్కూల్, కాలేజ్ గేమ్స్ వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు డి ఫిట్నెస్ జిమ్ క్రీడాకారులు ఎంపికైనట్టు జూడో, జిమ్, కరాటే కోచ్ టీవీవీ రమణ తెలిపారు. కాకినాడ డీఎస్సీ గ్రౌండ్‌లో సోమవారం స్కూల్ గేమ్స్ అండర్-19 వెయిట్, పవర్‌లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో ఎస్.సూర్యకృష్ణ, బి.మైథిలి, పి.తేజవర్మ, జె.దివ్యరాజ్, డి శ్రీనివాస్, అలాగే పవర్ లిఫ్టింగ్‌లో కె.ప్రసన్నకుమార్, కె.సూర్యమోహన్, పి.రాణి, బి మైథిలి ఎంపికయ్యారు.

### రైస్ మిల్లులో చోరీ సొమ్ము రికవరీ

#### ఆరుగురు నిందితుల అరెస్టు



రికవరీ సొత్తుతో సీఐ శ్రీనివాస్, ఎస్సై అప్పారావు

పెరవలి: ఎస్ఆర్‌కే రైస్ మిల్లులో ఈ నెల 15న జరిగిన చోరీ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, రూ.12.45 లక్షలను రికవరీ చేశామని నిడదవోలు సీఐ వి.శ్రీనివాస్ తెలిపారు. పెరవలి పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లకు వివరాలు తెలిపారు. మిల్లు గుమస్తా తందాసి కామేశ్వరరావు కీలకపాత్ర పోషించి ఈ చోరీ చేయించాడు. ఎంతో నమ్మకంగా ఉంటూ, తన స్నేహితులతో కలసి చోరీకి పాల్పడ్డాడు. ఇతనితో పాటు, మరో ఐదుగురు పాల్గొన్నారు. ఈ నెల 15న మధ్యాహ్నం బీరువాను ఐరన్ కట్టర్‌తో కట్ చేసి, అందులో ఉన్న రూ.2.20 లక్షలు, టేబుల్‌లో ఉన్న రూ.10.25 లక్షలు మొత్తం రూ.12.45 లక్షల పట్టుకెళ్లిపోయారు. ఈ సొమ్మును రికవరీ చేసి, నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించటంలో పెరవలి ఎస్సై పి.అప్పారావు, సిబ్బంది కృషి చేశారని అభినందించారు.

# నిండుకుంటున్న నెయ్యి

- సత్యదేవుని ప్రసాదానికి నెయ్యి కొనుగోలులో ఇక్కట్లు
- సోమవారంతో ముగిసిన పాత టెండర్
- మరో వారం వరకే దేవస్థానం వద్ద నెయ్యి నిల్వలు
- ఏటా రెండు లక్షల కిలోల నెయ్యి వినియోగం
- రూ.8 కోట్ల నుంచి రూ.పది కోట్ల వ్యయం
- ఎటూతేల్చని ప్రభుత్వం
- నిర్ణయం తీసుకోలేకపోతున్న దేవస్థానం అధికారులు



సత్యదేవుని ప్రసాదం ప్యాకెట్లు



సత్యదేవుని ప్రసాదం తయారు చేస్తున్న సిబ్బంది

అన్నవరం: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందనే సామెతలా తయారైంది ఇప్పుడు ప్రముఖ దేవస్థానాల్లో నెయ్యి కొనుగోలు వ్యవహారం. ఇప్పటి వరకు ఆరు నెలలకోసారి టెండర్ పిలిచి నెయ్యి లోయెస్ట్ టెండర్‌దారు నుంచి నెయ్యి కొనుగోలు చేసిన దేవస్థానం అధికారులు.. తిరుపతి లడ్డూ వివాదం కారణంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నెయ్యి సరఫరా చేయడానికి టెండర్ దారుడిని ఎంపిక చేసి నెయ్యి సరఫరా చేయమని ఆదేశించే అవకాశం లేదు. దేవస్థానాలలో నెయ్యి నిల్వలు తగ్గుతున్నా, సొంత నిర్ణయంతో డెయిరీల నుంచి కొనుగోలు చేసే వీల్లేకుండా పోయింది.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ప్రసాద విభాగంలో ఆవు నెయ్యి సరఫరా టెండర్ సెప్టెంబర్ 30వ తేదీ సోమవారంతో ముగిసింది. వాస్తవానికి అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు నెయ్యి కొనుగోలుకు టెండర్‌దారుడిని కూడా దేవస్థానం ఎంపిక చేసింది. కానీ సరఫరాదారుడిని నెయ్యి సరఫరా చేయమని కోరే అవకాశం లేదు. దీనికి ప్రధాన కారణం.. ఇప్పటి వరకున్న పద్ధతి ప్రకారం, టెండర్ ద్వారా లోయెస్ట్‌గా వచ్చిన సంస్థ నుంచి కొనుగోలు చేయాలా, లేక ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంటుందా అనే దానిపై అధికారులు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రూ.484కి టెండర్ ఖరారు**

అన్నవరం దేవస్థానంలో ప్రతి ఏటా ఆరు నెలలకొకసారి టెండర్ ద్వారా ఆవు నెయ్యి కొనుగోలు చేస్తుంటారు. గత ఆగస్టు నెలలో అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు ఆవు నెయ్యి సరఫరాకు ఈప్రొక్యూర్ టెండర్ పిలిచారు. ఆ తరువాత రివర్స్ టెండర్ ద్వారా నెయ్యి సరఫరాకు తిరుపతికి చెందిన వినాయక ఏజెన్సీ కిలో రూ.484కి సరఫరా చేయడానికి కొటేషన్ దాఖలు చేసి ఎల్-1గా నిలిచింది. కాగా విశాఖపట్నానికి చెందిన విశాఖ డెయిరీ కిలో రూ.488కి సరఫరా చేయడానికి కొటేషన్ దాఖలు చేసి ఎల్-2గా నిలిచింది. పరిస్థితులు సజావుగా ఉంటే నెయ్యి సరఫరా టెండర్ ఖరారు చేసి, సప్లై చేయమని ఆదేశాలు ఇచ్చేవారే. కానీ తిరుమలకు సరఫరా చేస్తున్న నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణలతో నెయ్యి కొనుగోలుపై దేవస్థానం అధికారులు ఏ నిర్ణయం తీసుకోలేదు.

గతేడాది టెండర్ ద్వారా రైతు డెయిరీ సంస్థ కిలో నెయ్యి రూ.564కి సరఫరా చేసింది. ఆ టెండర్ గడువు సోమవారంతో ముగిసింది. మరో వారం వరకు ఆ సంస్థ సరఫరా చేసిన నెయ్యి దేవస్థానంలో ఉండడంతో ప్రసాదం తయారీకి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. వారం తరువాత నెయ్యి కావాలంటే ఇప్పటి నుంచి సరఫరాకు ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం ఇంకా ఎటూ తేల్చకపోవడంతో అధికారులు ఇరకాటంలో పడ్డారు.

**సొంతంగా కొనుగోలు చేస్తే..**

టెండర్‌దారుని నుంచి కాకుండా, సొంతంగా డెయిరీల నుంచి కొనుగోలు చేస్తే ఇబ్బంది తప్పదనే అభిప్రాయంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. భవిష్యత్తులో దేవస్థానానికి నష్టం చేకూర్చారని విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తే చాలా ఇబ్బంది పడాలనే అభిప్రాయంలో వారున్నారు. అందువల్ల ప్రభుత్వమే దీనిపై మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

### ఏడాదికి రెండు లక్షల కిలోలు

అన్నవరం దేవస్థానంలో ప్రసాదం తయారీలో ఏటా సుమారు రెండు లక్షలు కిలోల నెయ్యి వినియోగిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 12 వేల కేజీల నుంచి 20 కేజీల వరకు ఉపయోగిస్తారు. ఆరు నెలలకు ఓసారి టెండర్ పిలిచి నెయ్యి కొనుగోలు చేస్తుంటారు. ఏటా నెయ్యి కొనుగోలుకు రూ.ఆరు కోట్ల నుంచి రూ.పది కోట్ల వరకు దేవస్థానం ఖర్చు చేస్తోంది.

### మార్గదర్శకాల కోసం ఎదురుచూపు



గత ఆరు నెలల కాలపరిమితి కోసం కొనుగోలు చేసిన నెయ్యి సరఫరా టెండర్ దారుని కాలపరిమితి సెప్టెంబర్ 30,తో ముగిసింది. ఆ టెండర్‌దారుడు సరఫరా చేసిన నెయ్యి మరో వారం రోజులు ప్రసాదం తయారీకి వస్తుంది. ఈలోగా ప్రభుత్వం నెయ్యి కొనుగోలుపై మార్గదర్శకాలు విడుదల చేస్తుందని చూస్తున్నాం. ఇప్పటికే వచ్చే ఆరు నెలలకు నెయ్యి సరఫరాకు టెండర్ పిలిచి లోయెస్ట్ కొటేషన్‌ను ఎంపిక చేశాం. ఇంకా వాళ్లకి సరఫరా ఆర్డర్ ఇవ్వలేదు. ప్రభుత్వం ఆ టెండర్‌దారుని నుంచి కొనమంటే లోయెస్ట్ సప్లయ్‌దారుని నుంచి కొనుగోలు చేస్తాం. ఒకవేళ ప్రభుత్వం ప్రత్యామ్నాయ పద్ధతి ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశిస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.

– కె.రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

# దొంగలకు రాజమార్గం

దేహానికి రక్త నాళాలు ఎంత కీలకమో.. దేశానికి రహదారులు అంతే ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. అందుకే జాతీయ రహదారులు దేశాభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పాలకులకు దండిగా ఆదాయాన్నీ ఆర్జించి పెడుతున్న హైవేలు.. అక్రమార్కులకూ రెండు చేతులా సంపాదించడానికి రాచమార్గాలు వేస్తున్నాయి. నాణ్యత లేని హైవేలపై టోల్ ట్యాక్సుల రూపంలో 'పెద్ద' సర్కారు జనాల జేబులకు చిల్లులు పెడుతుంటే.. పుట్టగొడుగుల్లా హైవేలపై పుట్టుకొస్తున్న దొంగలు.. ప్రైవేట్ కంపెనీల సొత్తును దర్జాగా దోచేస్తున్నారు. తమ వ్యాపారాలకు సౌకర్యంగా ఉండేలా హైవేల వెంబడి డెన్లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. కింది నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకూ కిమ్మనకపోవడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది.

- హైవేపై జోరుగా చీకటి వ్యాపారాలు
- లారీల నుంచి ఆయిల్, ఐరన్ సామగ్రి చోరీ
- పలుచోట్ల దర్జాగా వెలసిన అనధికార స్థావరాలు
- అక్రమ దందాకు దండిగా 'పెద్దల' ఆశీస్సులు



లారీల నుంచి దొంగిలించిన ఇనుప ఊచలు

తుని రూరల్: అక్రమ వ్యాపారాలకు 16వ నంబరు జాతీయ రహదారి అడ్డాగా మారుతుంది. అక్రమదారులు చీకటి వ్యాపారాలకు హైవేను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. దొంగిలించిన ఇనుము, ఆయిల్ అమ్మకాలతో జేబులు నింపుకొంటున్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ, హైదరాబాద్, చెన్నైకు ఇదే ప్రధాన జాతీయ రహదారి కావడంతో, రోజు వేలాది వాహనాలు ఎగుమతులు, దిగుమతులతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిని ఆసరాగా తీసుకుని అక్రమ వ్యాపారులు ఆదాయ వనరుగా మలుచుకుంటున్నారు.

**డ్రైవర్లకు ఆశ చూపి..**

తుని మీదుగా నిత్యం విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి వేలాది టన్నుల ఇనుము, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీల నుంచి డీజిల్, పెట్రోల్ ఎగుమతులు జరుగుతున్నాయి. అక్రమ వ్యాపారులు కొందరు డ్రైవర్లకు డబ్బు ఆశ చూపించి, లోబర్చుకుంటూ ఆయిల్, ఇనుము చోరీకి పాల్పడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్థావరాలు కూడా ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో అక్రమాలకు పాల్పడుతున్నారు. లోడు లారీల నుంచి తస్కరించిన ఇనుము, ఆయిల్‌కు మార్కెట్ ధరలో 50 శాతాన్ని డ్రైవర్లకు ముట్టజెప్పుతున్నారు. ఇలా సేకరించిన ఆయిల్, ఇనుము, ఇతర ప్రాంతాలకు తరలించి పూర్తిస్థాయి నగదుకు విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు.

**విచ్చలవిడిగా స్థావరాలు**

తుని మండలం ఎర్రకోనేరు, తేటగుంట సమీపాల్లో వారి స్థావరాలు కొనసాగుతున్నాయి. ఈ స్థావరాల వద్ద చోరీకి ఎప్పుడు తమ మనుషులు ఉండే విధంగా అక్రమార్కులు ఏర్పాట్లు చేసుకున్నారు. కొత్తగా వ్యాపారాన్ని నిర్వహించేందుకు తేటగుంట వద్ద అర ఎకరాలో భారీ స్థావరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిసింది. గత నెలలో తుని రూరల్ పోలీసులు గుర్తించిన కొన్ని స్థావరాలను తొలగించారు. సవాల్ విసిరనట్టు వారం రోజుల తర్వాత అక్కడే స్థావరాలను పునఃప్రారంభించి అక్రమ వ్యాపారాలను మూడు టన్నుల ఐరన్, ఆరు పీపాల ఆయిల్ అన్నట్టు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లోనే ఎక్కువగా వీరి కార్యకలాపాలు సాగుతుండడంతో,, అటు అధికారులు, ఇటు సామాన్యుల దృష్టి పడడం లేదు. కొందరు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి ఉన్నతాధికారుల వరకు తెలిసే హైవేపై చీకటి వ్యాపారాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ, చీకటి వ్యాపారాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తేటగుంట వద్ద అక్రమ ఆయిల్ వ్యాపారానికి కొత్తగా సిద్ధం చేసిన స్థావరం



హైవేను ఆనుకుని ఏర్పాటు చేసిన ఆయిల్ అక్రమ స్థావరం

### నన్నయ యూనివర్సిటీ బోర్డు సభ్యుడిగా సువర్ణకుమార్



ఉత్తర్వులు అందుకుంటున్న సువర్ణకుమార్

గోకవరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యునిగా గోకవరానికి చెందిన హన్నా బీఈడీ కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ బి.సువర్ణకుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వుల కాపీని ఆయనకు అందజేశారు. ఆయన మూడేళ్ల పాటు బోర్డు సభ్యునిగా కొనసాగుతారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అమలాపురం రూరల్: రెడ్డిపల్లిలో ఆలయం వద్ద సీరియల్ లైట్లు వేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి దాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అమలాపురం నారాయణపేటకు చెందిన కట్టా శ్రీనివాసరావు(50) కాంట్రాక్టు విద్యుత్ పనులు చేస్తుంటాడు. రెడ్డిపల్లిలో ఆలయం వద్ద సీరియల్ లైట్లు వేస్తుండగా,11 కే వీ వైర్లు తగలడంతో అతడు విద్యుదాఘాతానికి గురై, కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు అమలాపురం కిమ్స్‌ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి



ఐఎంఎల్ డిపో వద్ద ఆందోళన చేస్తున్న మద్యంషాపుల సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్లు

రాజమహేంద్రవరం రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సేల్స్‌మన్, సూపర్‌వైజర్ల జిల్లా యూనియన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే మంగళవారం నుంచి విధులు బహిష్కరిస్తామని అల్టిమేటం జారీ చేసింది. సోమవారం హుకుంపేటలోని ఏపీ బేవరేజస్ ఐఎంఎల్ డిపో వద్ద చలో డిపో పేరిట కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. సంఘ ప్రతినిధులు వినతిపత్రాన్ని డిపో పరిపాలనాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రతినిధి రాజసూర్య మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల మందిని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో తీసుకున్నారని, ఐదేళ్ల పాటు పనిచేశామని చెప్పారు. నూతన మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో తమ భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. తమ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధగా ఉందన్నారు. తమకు న్యాయం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సరకుతో పోలీసులు

అయినవిల్లి: కారులో అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ భీమరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని మడుపల్లి వద్ద డాక్టర్ సింబల్ ఉన్న లోగోతో ఉన్న కారులో అక్రమ మద్యం తరలిస్తున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఆ కారును వేగంగా పోనిచ్చారు. దీంతో మరో పోలీసు బృందానికి సమాచారమిచ్చి కారును సీజ్ చేశారు. యానాం నుంచి కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు ఈ మద్యం తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన నలుగురిని అరెస్టు చేశారు. రూ.52 వేల విలువైన ఈ మద్యంలో 192 రకాల బ్రాండ్లు ఉన్నాయి.

# ఫ్లెక్సీ వివాదంతో శ్రీరంగపట్నంలో ఉద్రిక్తత

- వైఎస్సార్ సీపీ నేత నానాజీపై కూటమి నేతల దాడి
- దాడిని ఖండిస్తూ కార్యకర్తల ఆందోళన
- ఇరు వర్గాలపై కేసులు నమోదు



శ్రీరంగపట్నంలో గుమిగూడిన ఇరుపక్షాల వారు, పోలీసులు

మధురపూడి: ఫ్లెక్సీ వివాదంలో వైఎస్సార్ సీపీ నేత, కోరుకొండ వైస్ ఎంపీపీ స్వర్ణకుమారి భర్త కొయిడాల నానాజీపై కూటమి కార్యకర్తలు దాడికి పాల్పడిన సంఘటన కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. చెరువు గట్టున ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కూటమి కార్యకర్తలు దీనిపై ఉద్దేశపూర్వకంగా మరో ఫ్లెక్సీని పెట్టారు. ఈ వ్యవహారంపై వైఎస్సార్ సీపీ నాయకులు అప్పట్లోనే అభ్యంతరం తెలిపారు. దీంతో కొద్ది రోజుల్లో ఫ్లెక్సీని తొలగిస్తామని కూటమి కార్యకర్తలు హామీ ఇచ్చారు. ఇలాఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఆ ఫ్లెక్సీని తొలగించి, దాని ఫ్రేమ్‌ను అప్పగించలేదు. దీంతో సోమవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఫ్లెక్సీని తొగించేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఫ్లెక్సీ చిరిగిపోయింది. దీంతో కూటమికి చెందిన దొడ్డి అప్పలరాజు, అధికంశెట్టి శ్రీను, కర్రి రాజు అక్కడకు చేరుకుని గొడవకు దిగారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో, విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కూటమికి చెందిన ముగ్గురు కలిసి వైఎస్సార్ సీపీ నాయకుడు కొయిడాల నానాజీ చొక్కా పట్టుకుని, దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు నిరసనగా కొద్దిసేపు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కొద్దిసేపు నిరసన చేపట్టారు. అక్కడున్న కోరుకొండ ఎస్సై శ్యామసుందరరావు, సిబ్బంది ఇరువర్గాల వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కొయిడాల నానాజీ ఇచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అలాగే అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదుపై నానాజీ, మరికొందరిపై కేసు నమోదైంది. ఫ్లెక్సీ బోర్డు వివాదంలో ఇరువర్గాల వారి లోపాలుండటంతో, రెండు వర్గాలపై కేసులు నమోదు చేయనున్నట్టు కోరుకొండ సీఐ సత్యకిషోర్ తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కాగా ఇరువర్గాలపై కేసులు నమోదు కావడంతో, ఆయా వర్గాల వారు నిష్క్రమించారు.



వివాదానికి కారణమైన ఫ్లెక్సీ బోర్డు

### బస్సు డ్రైవర్‌కు జైలు

అమలాపురం రూరల్: మోటార్ సైకిల్‌ను ఢీకొని ఇద్దరిని తీవ్రంగా గాయపర్చిన కేసులో ఆర్టీసీ బస్సు డ్రైవర్ చవ్వాకుల శ్రీధర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏజేఎఫ్‌సీఎం జడ్జి వి.గౌరీశంకర్ తీర్పు చెప్పారు. రూరల్ సీఐ వీరబాబు వివరాల ప్రకారం, కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన కర్రి శ్రీనివాస్, కర్రెడ్ల వీరబాబు కలిసి మోటార్ సైకిల్‌పై 2017 జులై 18న ఏసీలు బిగించేందుకు లక్కవరం బయలుదేరారు. అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి ఐస్ ఫ్యాక్టరీ వద్ద అమలాపురం-కాకినాడ ఆర్టీసీ బస్సు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనివాస్, వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వీరబాబు మరణించాడు. చికిత్స అనంతరం కోలుకున్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి తాలూకా ఎస్సై గజేంద్ర కుమార్ కేసు నమోదు చేశారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో డ్రైవర్ శ్రీధర్‌కు జైలుతో పాటు, రూ 6 వేల జరిమానా విధిస్తూ జడ్జి గౌరీశంకర్ సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ రాజశేఖర్ వాదించారు.

### పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

రామచంద్రపురం: మైనర్ బాలికపై లైంగిగ దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు రామచంద్రపురం సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన గుత్తుల బాల వెంకటకృష్ణ కొంత కాలంగా ప్రేమ పేరుతో రామచంద్రాపురంలో ఇంటర్మీడియెట్ సెకండియర్ చదువుతున్న 17 ఏళ్ల బాలిక వెంట పడి వేధిస్తున్నాడు. ఆగస్టు 16న మధ్యాహ్నం బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండగా, మద్యం తాగి, ఆమె ఇంటికెళ్లాడు. పెళ్లి చేసుకుంటానంటూ, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం రామచంద్రాపురం చింతపల్లి సూరన్న నగర్‌లో నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చారు. అతడికి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్టు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

# కాలువలో పడి బాలుడి మృతి

సీతానగరం: రఘుదేవపురం గొప్పి కాలువలో పడిన ఎలుగుబంటి వినయ్(15) మృతదేహాన్ని సోమవారం ఉదయం పోలీసులు కనుగొన్నారు. ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వినయ్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి రఘుదేవపురం నల్గొండ రోడ్డులో పేరంటాల అమ్మవారి గుడి వద్ద గొప్పి కాలువ వద్దకు ఫొటోలు తీసుకోవడానికి ఆదివారం సాయంత్రం వచ్చాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. గాలింపు చేపట్టడంతో సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రామ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.